

# ’అదే’ కథలు

## – ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని ‘దేశీ’లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం ‘య’ అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి. అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకీ, బాధలకీ, దుఃఖాలకీ నా బాధ్యత లేదు.

### 54
## తద్దినం

పెళ్ళైన మూడు నెలలకి అమెరికా వచ్చిన రంగరాజన్ గురించి అనసూయకి తెల్సిన విషయం ఇది – అయ్యగారికి అసూయ అవతలవార్ని చూసి. అన్నింటికన్నా నవ్వొచ్చే విషయం ఇది. చూడండి, మీరు ఫలానా చోట పుట్టారు. ఫలానా చోట చదువుకున్నారు. ఉద్యోగం మరోచోట చేసారు. ఈ పుట్టి, చదువుకున్న ఊర్లలో తప్ప మిగతా చోట – అమెరికాలో అయినా సరే, మీకు ఎవరూ తెలియదు అక్కడకి వెళ్ళేవరకూ. ఉద్యోగం కోసం హైద్రాబాదు వెళ్ళారనుకుందాం, గుంటూర్ నుంచి. హైద్రాబాద్ లో కొంతమంది పరిచయం అవుతారు. కానీ వాళ్లని చూసి, వాళ్లకున్న డబ్బులు చూసి అసూయ జనిస్తుంది. వింత కదా? వాళ్ళెవరో తెలియదు మనకి అయినా వాళ్ళని చూసి మనకి అసూయ దేనికో? అలాగే రంగాక్కూడా. మొదట్లో అనసూయ రంగాతో చెప్పడానికి ప్రయత్నించింది – అసూయ అనేది అన్నింటికన్నా సులభంగా జయించే పాత అలవాటనీ, దాన్ని వదులుకోవడం ఈజీ వీజీ అనీ. ఎందుకంటే అంబానీని చూసి బిల్ గేట్స్ ని చూసి మనకి అసూయ రాదు కానీ పక్కింట్లో ఉన్నవాడు కొత్త కారు కొంటే అసూయ. అదీ తెలుసున్న తెలుగువాడు కొంటే మరింత అసూయ. ఇవన్నీ ఎన్నోసార్లు రంగాకి చెప్పి చెప్పి నోరు నెప్పెట్టిన అనసూయకి అయ్యగారి గురించి పాత

విషయాలు తెలిసాక నోరుమూసుకుంది. అనసూయ అర్ధం చేసుకున్నంతలో రంగరాజన్  విషయాలు ఇలా ఉన్నాయి – అదే అమెరికా రాకముందు.

రంగాగారు పుట్టినది మద్రాసు, అదే చెన్నైలో. ఇంట్లో తల్లీ తండ్రీ, ఆయన తమ్ముడూ, వాళ్ళావిడా, ఆయన అక్కా బావా, వీళ్ల పిల్లలందరూ బతికేది సామూహికంగా ఒకే ఒక ఇంట్లో. అద్దెల వల్ల అవ్వొచ్చు లేదా అలా బతకాలని ఇష్టమేమో వీళ్లకి కానీ వీళ్ళంతా బతికినది ఒకే మూడు బెడ్రూంల ఇంట్లో. వంట, తిండీ అన్నీ సామూహికం. పిల్లలే పది మందున్నారు ఈ నాలుగు కుటుంబాలకీ. ఎవరైనా ఏ స్వీటో, హాటో కొనాలంటే వెనుకంజ వేసే పరిస్థితి. పది మంది పిల్లలకీ ఎనిమిది మంది పెద్దలకీ కొనాలి. తన కుటుంబానికి మాత్రమే కొంటే ఎవరేమనుకుంటారో అనే పరిస్థితి. అందువల్ల తిండికి పిల్లలు మొహం వాచినట్టు ఉండడం సర్వసాధారణం. సరే, ఏదో పండక్కో మరోదానికో ఓ కొన్ని ఫలహారాలో స్వీటో కొని తెస్తే అందరికీ తలో ముక్కా వచ్చినప్పుడు ఎవరికి ఏదొచ్చిందనే దెబ్బలాటలు పిల్లలమధ్య. పెద్ద కుర్రాడైతే చిన్నవాళ్ల చేతుల్లోంచి లాగేసుకుని తినేయడం సాధారణం. అందువల్ల బలం ఉన్నవాడిదే రాజ్యం. అలా రంగా గారు పెరిగి పెద్దవారయ్యారు. పెళ్లయ్యేసరికి కాస్త మార్పు వచ్చినట్టనిపించినా పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుర్రెతో కానీ పోవని ఊరికినే అనలేదు కనక ప్రస్తుతానికి రంగాగారి అసూయ పేద్ద స్థాయిలో బయటపడుతూ ఉండడం వింత. మరో విషయం ఏమిటంటే రంగా గారు సన్నగా రివటలా ఉంటాడు. ఏది తిన్నా కడుపునెప్పి. అనసూయ అమెరికాలో ఉద్యోగం సంపాదించి పెళ్ళికి ఇండియా వెళ్ళినప్పుడు ఆవిడకి ఈ విషయాలు ఏమీ తెలియవు. రంగాగారి కుటుంబం మంచిదనీ, ఇదనీ, అదనీ చెప్తే పెళ్ళైపోయింది. అలా హెచ్ వన్ అమ్మగారి కూడా హెచ్ ఫోర్ మీద అయ్యగారు అమెరికా వచ్చారు. ఆయనకీ ఉద్యోగానికి ప్రయత్నాలు జరుగుతున్నై.  ఇప్పటివరకూ తనకి అమెరికా రావడానికి సహాయం చేసిన అమ్మగారంటే, ఆవిడ చేసే ఉద్యోగం అంటే – అదే తనకి ఇంకా ఉద్యోగం రానందుకు – రంగాకి అసూయ. పక్కన అపార్ట్ మెంట్లో ఉండే మరో ఉద్యోగం చేసే దేశీ జంట అంటే – వాళ్లెవరో రంగాకి తెలియకపోయినా, అసూయ. రంగా గారి  కడుపునెప్పికి డాక్టర్ కి చూపించారు. కారం అతిగా తినడం వల్ల అలా అయింది అని ఏదో జబ్బు పేరు చెప్పేడు డాక్టర్ బాబు. అప్పుడు చూచాయగా తెల్సిన విషయం. అయ్యగారు చిన్నప్పుడు సామూహిక ఇంట్లో ఉండడం వల్ల కూరా నారా అంత పెద్దగా ఉండేది కాదు. పప్పూ అదీ విధిగా చేసినా ఇరవై మందికి కూర చేయాలంటే కష్టం కదా – ధరవరల వల్ల కానీ పని వల్ల కానీ? అందువల్ల పప్పు, ఆవకాయ, మజ్జిగతో అయిపోయేది జీవితం. అది రంగామీద దాడి చేసింది. అలా ఈ వదలని కడుపునెప్పి అంటుకుంది. అయితే తనకి ఉన్న నెప్పికి తిండి సరిగ్గా తినలేడు సరే, కానీ అనసూయ మాములుగా తింటున్నందుకు అసూయ. ఈ అసూయ తారాస్థాయి అందుకుంది తొందర్లోనే. మూడు నుంచి ఆరునెలల్లో రంగాగారికి ఉద్యోగం దొరికింది కానీ ఈ సారి తనకంటే అనసూయకి ఎక్కువ జీతం వస్తున్నందుకు అసూయ. ఇలా జీవితం గడుస్తూంటే ఆవిడ తింటున్నందుకు ఏదో సాకు చూపించి ఈయన అరుపులు. ఆవిడ కొత్తలో నోరు మూసుకున్నా

ఇద్దరు పిల్లలు పుట్టేసరికి ఇంక ఆవిడ కూడా ఈయన చూపించే అసూయ మీద నోరు పారేసుకోవడం మొదలైంది. పిల్లలు పెరిగాక వాళ్ళూ అలాగే నోరుపారేసుకుంటున్నారు తండ్రి మీద. ఆయనికి ఈ ముగ్గురూ అంటే కోపం – తన మీద అరుస్తారని. కారణం మాత్రం తానే అని ఎప్పుడూ తట్టలేదు అయ్యగారికి.

మనుషులని రెండు రకాలుగా చెప్పుకోవచ్చు. మొదటి రకం మనుషులు ఎటువంటివారంటే, తమకి దొరకనిది అవతలవాళ్లకి కూడా ఎటువంటి పరిస్థితుల్లోనూ దొరక్కూడదనే దారుణమైన మనఃస్తత్వం. రెండో కోవకి చెందినవారు అయ్యో నాకు ఎలాగా లేదు పోనీ అవతలివారికైనా దొరికింది, అని సంతోషపడేవారు. ఈ రెండో రకం మనుషులు హాయిగా ఉండగలరు. మొదటి కోవలోకి రంగరాజన్ వంటివారొస్తారు. ఈ రంగాగారి కడుపునెప్పి పెరిగే కొద్దీ ఆయన అసూయ పెరుగుతూనే ఉంది. వైస్ వెర్సా కూడా. అన్నింటికన్నా నీచం ఏమిటంటే ఈ నెప్పి పెరిగే కొద్దీ ఆయన ఆఖరికి తన స్వంత పిల్లలు ఏదైనా తిన్నా ఏడిచే స్థితిలోకి వచ్చేడు. అయితే కొన్నాళ్లకి అనసూయ రొటీన్ గా డాక్టర్ దగ్గిరకి వెళ్తే ఆయన చెప్పేడు అనసూయ కడుపులో కేన్సర్ ఉందని అది ఇంక తగ్గదనీ. రంగాకి ఎందుకో కాస్త సంతోషం – ఇంక ఆవిడ కూడా తనలాగే తిండి తినలేదు కదా? నమ్మకంగా ఉండకపోవచ్చు కానీ నిజంగా జరిగినదిదే. మరో నాలుగు నెలలకి ఆవిడకి నూకలు చెల్లిపోయేయి. పాపీ చిరాయువు అన్నట్టు రంగా మాత్రం బతికే ఉన్నాడు, ఏ రోజుకారోజు కడుపునెప్పితో అల్లల్లాడుతూ.

అప్పటివరకూ నోరు పారేసుకున్న రంగా గారికి అనసూయ వెళ్ళిపోయాక ఆవిడ విలువ తెలిసొచ్చింది. ఏడాది పోయాక ఆవిడకి తద్దినం పెట్టాల్సి వచ్చినప్పుడు పిల్లలిద్దర్నీ పిలిచి చెప్పేడు – ఊర్లో ఉన్న గుడిలో సంతర్పణ చేస్తాట్ట ఫలానా రోజున అనసూయ పోయినందుకు. ఓ పూజారికి డబ్బులిచ్చి తద్దినం పెట్టిస్తాట్ట. ఎప్పుడు వెళ్దాం అని ప్రశ్న. పిల్లలిద్దరికీ అప్పటికి పూర్తి అ అవగాహన ఉంది ఈయన సంగతి, వాళ్ల అమ్మ, తమ మీద ఉండే – ఆయనకున్న కడుపునెప్పి తమకి లేదనే – అసూయ గురించీను. ఇద్దరు ముక్త కంఠంతో చెప్పేసేరు – మేము రాము. అమ్మ బతికున్నంత కాలం ఆవిడని చంపుకు తిన్నావు, ఇప్పుడు నువ్వు పెట్టే తద్దినం వల్ల అవిడకేం ఉపయోగం? బతికున్న మనిషిని చూసి ఏడిచే నీలాంటి వాడు మా నాన్న అని చెప్పుకోవడం ఎంత సిగ్గుచేటు? అయితే వాళ్ళు తండ్రితో చెప్పని మాట ఒకటుంది. అది వాళ్లకి అనసూయ బతికున్నప్పుడు, పోయేముందు చెప్పినదే – "తాను పోయాక ఎటువంటి కార్యాలు చేయక్కర్లేదు. వీలుంటే, గింటే ఏడాదిలో ఏదో ఓ రోజు ఊర్లో ఉన్న లోకల్ సూప్ కిచెన్ కి ఆహారం, వాళ్ళు తినే మరికొన్ని పదార్థాలు ఇవ్వండి. అంతే చాలు. జీవితంలో ఎప్పుడు ఎవర్నీ చూసి అసూయపడవద్దు."

నీతి: బతికున్న మనిషిని గౌరవించనప్పుడు ఆయన/ఆవిడ చచ్చాక తద్దినం పెట్టడం శుద్ధ అనవసరం.

Post your comments